క్లుప్తంగా

ఈపూరు ఎంపీడీవోగా కె.ప్రభాకర్

ఈపూరు: ఎంపీడీవోగా కె.ప్రభాకర్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన రంగనాయకులు సొంత జిల్లా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో మేడికొండూరు ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.ప్రభాకర్ త్వరలో ఈపూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు శుక్రవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందని తెలిపారు. కావున సభ్యులు, అధికారులు, సిబ్బంది సమావేశానికి తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు.

ట్రాఫిక్ సీఐగా లోకనాథం



నరసరావుపేట టౌన్: నరసరావుపేట ట్రాఫిక్ సీఐగా సి.హెచ్.లోకనాథం గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేసిన రమేష్‌బాబును వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న లోకనాథంను ఆయన స్థానంలో నియమించారు. సీఐగా బాధ్యతలు చేపట్టిన లోకనాథం గతంలో 2014 నుంచి 2018 వరకు నరసరావుపేట వన్‌టౌన్ ఎస్‌ఐగా పనిచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ స్వచ్ఛంద సంస్థ ఆదేశాల మేరకు వినుకొండ వైద్య ఆరోగ్య శాఖ, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం వినుకొండ మండలంలో లయోలా బాయ్స్ హైస్కూల్‌లో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సంస్థ సిబ్బంది ఎస్‌కే ఆశ, ఏడుకొండలు, రహంతా, రమేష్, వైఆర్‌జీ కేర్ సిబ్బంది, ఎం.అనూష పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేట రూరల్: గుర్తుతెలియని వ్యక్తి పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోటప్పకొండ సమీపంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాలు. గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడనే స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు కోటప్పకొండ వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన గ్లాస్‌లో పురుగుమందు కలిపి ఉండటాన్ని గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అరబిక్ పాఠశాలకు ప్రింటర్ అందజేత



చిలకలూరిపేట: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో చీరాల రోడ్డులోని జీనత్ ఎడ్యుకేషన్ సెంటర్ పాఠశాలకు ప్రింటర్ కమ్ జిరాక్స్ మిషన్‌ను గురువారం అందజేశారు. క్లబ్ సభ్యురాలు పి.ధనలక్ష్మి అందించిన ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని తెలిపారు. గతంలోనూ క్లబ్ తరఫున ఎన్నో స్కూళ్లకు అవసరమైన సామగ్రి అందజేయడం జరిగిందన్నారు. ఖాలిద్ ఖాన్, రహమాన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రొంపిచర్ల మండల పరిషత్ సమావేశం

రొంపిచర్ల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎండీవో మాధ్యుబాబు తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాల సమీక్షతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలను చర్చించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే అందరు సభ్యులకు ఎజెండా అంశాలను తెలియజేశామన్నారు. సభ్యులందరూ వీలు కల్పించుకొని సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఈపూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. మండల అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి 100 రోజుల్లో ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, నిశ్శంకర శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలి

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



రూరల్ సర్కిల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

నరసరావుపేట రూరల్: ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, ఎఫ్ఐఆర్ ఇండెక్స్, కేసు డైరీలను, రిజిస్టర్లను పరిశీలించారు. విచారణలో ఉన్న కేసుల పురోగతి, దర్యాప్తు తీరును అడిగి తెలుసుకున్నారు. దర్యాప్తులో ఉన్న కేసుల్లో సత్వరమే పూర్తిచేసి బాధితులకు న్యాయం చేసే విధంగా పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. విచారణలో ఉన్న పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్‌కు గల కారణాలను తెలుసుకొని విచారణను వేగవంతం చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. పెండింగ్ కేసులను ప్రణాళికబద్ధంగా త్వరితగతిన పూర్తిచేయాలని, నిందితులను అరెస్ట్‌చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. నరసరావుపేట రూరల్ పరిధిలో విజుబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యలు ఉండే ప్రదేశాలను గుర్తించి బీట్లను పెంచి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అక్రమ మద్యం, అక్రమ ఇసుక, గంజాయి మొదలైన నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, నిల్వలపై దృష్టి సారించాలని తెలిపారు.

గ్రామ, వార్డు సచివాలయాల పోలీసుల సహకారంతో మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టడంపై దృష్టిసారించాలని తెలిపారు. సైబర్ నేరాలు, లోన్‌యాప్‌ల మోసాలు, పోక్సో నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించాలని తెలిపారు. పోలీసుల అధికారులు, సిబ్బంది యోగక్షేమాల విషయంలో ఎటువంటి సమస్య ఉన్నా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.నాగేశ్వరరావు, రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐ సిహెచ్ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

కడుపునిండా అన్నం పెట్టడం లేదు

- అన్నం ముద్దలుగా ఉంటోంది
- పిల్లలు తినలేకపోతున్నాం
- ఎంఈవోకు ఎస్ఎంసీ చైర్మన్ ఫిర్యాదు



భోజనం చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని 12 వార్డు స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని కాంట్రాక్టర్లు సరిగ్గా పెట్టడం లేదని ఎస్ఎంసీ చైర్మన్ ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా పాఠశాలలోని పిల్లలతో మధ్యాహ్న భోజనం చేశారని, మెనూ ప్రకారం పులిహోర, చట్నీ, కోడిగుడ్డు ఇచ్చారని, అన్నం ముద్దలు, ముద్దలుగా, టమోటాలతో చేసిన కూర బాగోలేదని తెలిపారు. మంచినీటి కొరత ఉందని, గతంలో వాటర్ మిషన్ రెడీగా ఉందని కొద్ది రోజుల్లో మంచినీటి కొరత తీరుతుందని తెలిపారు కాని ఇంకా తీరలేదని తెలిపారు. మధ్యాహ్న భోజనం వడ్డేందుకు రోజుకు ఒకరు వస్తున్నారని వివరించారు. కొంతమంది పిల్లలు ఇంటి దగ్గర నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా పాఠశాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఎంఈవోను కోరారు.

పేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట: ఏపీని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి తీరుతామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ప్రపంచంలో దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించే కార్యక్రమం చేపట్టామన్నారు. చంద్రబాబు సీఎంగా పదవి చేపట్టాక చేసిన తొలి ఐదు సంతకాలతోనే రాష్ట్రం దశ మారిపోయిందని పేర్కొన్నారు. 100 రోజుల్లో ఎన్నో అద్భుతాలు సృష్టించామని, అలాగే సూపర్ సిక్స్ కూడా అమలు చేస్తామని చెప్పారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్ స్వచ్ఛతా హి సేవా ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత–పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ గురువారం పట్టణంలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి కోటసెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీకి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ పాల్గొన్నారు. 23వ ఆంధ్ర ఎన్‌సీసీ బెటాలియన్ హవల్దార్లు సుభాష్‌చంద్ర, సుభాష్ పున్యాలు, పలు కళాశాలల ఎన్‌సీసీ అధికారులు మేడికొండ రాజష్‌బాబు, టీ.ఆంజనేయులు, షేక్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. కోట సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఎన్‌సీసీ క్యాడెట్స్ శుభ్రం చేశారు. అనంతరం క్యాడెట్స్‌తో కలిసి ఎమ్మెల్యే రోడ్లను శుభ్రపరిచారు. 200మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

జ్వరాల సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్



సూచనలు చేస్తున్న రవీంద్ర రత్నకర్

శావల్యాపురం: గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది జ్వరాల సర్వే పారదర్శకంగా చేయాలని జిల్లా మలేరియా అధికారి కేతిపల్లి రవీంద్ర రత్నాకర్ అన్నారు. గురువారం మండలంలోని మతుకుమల్లి వైద్య ఆరోగ్య జ్వరాల సర్వే చేస్తున్న తీరును క్షేత్రస్థాయి లో పరిశీలించారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి మాట్లాడుతూ వర్షాకాలం సీజను కావటం చేత సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో నిరంతరం ప్రజలకు వైద్యసేవలు సకాలంలో అందేలా బాధ్యత వహించాలన్నారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. దోమ కాటు వల్ల మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ తదితర వ్యాధులు వస్తాయన్నారు. దోమకాటు నివారణ దోమతెరలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. కాలనీలో పర్యటించి వైద్య ఆరోగ్య సిబ్బంది తగు సూచనలు సలహాలు వివరించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆయనతో పాటు సూపర్‌వైజరు అలవలపాటి ఏడుకొండలు, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలిత, ఎంఎల్‌హెచ్‌పీ శంకర్ తదితరులు ఉన్నారు.

కార్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

చిలకలూరిపేట టౌన్: కార్లు చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సుబ్బా నాయుడు వివరాలు వెల్లడించారు. జూన్ నెలలో నాదెండ్ల మండలం గణపవరంలో ఆర్ఆర్ కార్ ట్రావెల్స్‌లో మారుతి సిఫ్ట్ డిజైన్ కారు చోరీకి గురైందని, ఈనెలలో అమృతా డాబా హోటల్ వద్ద మరో కారు చోరీ చేశారన్నారు. ఈవిషయమై రూరల్ మండలం కావూరు గ్రామానికి చెందిన కార్‌స్పా మెకానిక్ షేక్ సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. గురువారం మురికిపూడి పరిధిలోని టీఎస్-5 రెస్టారెంట్ వద్ద ముగ్గురు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కార్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో పలు బృందాలు ఈకేసును చేధించినట్లు తెలిపారు. రూ. 14 లక్షల విలువ చేసే కేసును చేధించినందుకు రూరల్ సీఐతోపాటు, ఎస్సై అనిల్‌కుమార్, ఏఎస్సై రోసిబాబు, రవిచంద్రబాబు, కానిస్టేబుల్ ఎం.ఇర్మియి, అశోక్, శ్రీకాంత్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ మధుబాబులను ఎస్పీ అభినందనలు తెలిపారు.

ఆక్రమణలు తొలగించాలంటూ వినతి

నరసరావుపేట ఈస్ట్: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో రోడ్లకు ఇరువైపులా రోజురోజుకు పెరిగిపోతున్న ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్‌చేశారు. అరండల్‌పేటలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకు, గుంటూరు రోడ్డు, పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డులోని ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. ఇష్టారాజ్యంగా రోడ్లను ఆక్రమిస్తున్నప్పటికీ మున్సిపల్, పోలీస్ శాఖలు చర్యలు తీసుకోవటంలో విఫలమయ్యారని విమర్శించారు. జిల్లా అధికారులు వెంటనే చొరవ తీసుకొని ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, ఉప్పలపాటి రంగయ్య పాల్గొన్నారు.

మీ సేవలు అపురూపం



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేట, వినుకొండ నుండి బదిలీపై వెళ్తున్న విద్యుత్ అధికారులను గురువారం విద్యుత్ కార్యాలయంలో ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎస్ శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ అమరావతికి, వినుకొండలో విద్యుత్ ఏడీఈగా పనిచేస్తున్న పి.కిరణ్‌బాబు గుడివాడ రూరల్‌కు బదిలీపై వెళ్తున్న సందర్భంగా పై ఇరువురు అధికారులను ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 జిల్లా అధ్యక్షులు జి.సీహెచ్ కొండలు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కొండలు మాట్లాడుతూ అధికారులు కిందిస్థాయి ఉద్యోగులకు పూర్తిసహకారం అందించారని కొనియాడారు. అలాగే పై అధికారులకు కూడా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మునెయ్య, నిత్యానందం, రవికుమార్, బాలు, కోటి, రమేష్, సురేష్, లక్ష్మయ్య, వెంకటేష్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన లయోలా ఆటస్థలం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని లయోలా హైస్కూల్ ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ అండర్-17 బాలబాలికలకు జరుగుతాయని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఎం. సురేష్ కుమార్ తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 13 జిల్లాల నుంచి 520 మంది బాలబాలికలు ,అన్ని జిల్లాల నుంచి కోచ్ మేనేజర్లు పాల్గొనున్నారని తెలిపారు. క్రీడాకారులకు ఉచిత వసతి మరియు భోజనాలను ఏర్పాటు చేయడమైనదన్నారు. గుంటూరు జిల్లా జట్టు సాధన చేయడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల యాజమాన్యం జ్ఞానదేవ్ ఫాదర్, హెచ్‌ఎం రవిఫాదర్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీఈవో వెంకటేశ్వర్లు మార్గదర్శక, సహాయసహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు బి.ఏడుకొండలు, పి.యలమంద, ఆర్. రాధాకృష్ణమూర్తి, వై.వి. చిరంజీవిరావు, జి. వీరాంజనేయులు, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్‌కు మరమ్మతులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిపేర్‌కు వచ్చిన ఆర్వో ప్లాంట్‌కు గురువారం మరమ్మతులు నిర్వహించారు. ఈ మరమ్మతులు కోసూరు వెంకటరత్నం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15 వేల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేశారు. ఈ ప్లాంట్‌ను 2016వ సంవత్సరంలో కోసూరి ఛారిటబుల్ ట్రస్ట్ వారు ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా మంచినీళ్లకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల సమస్య పరిష్కారం అయ్యింది. మరమ్మతులు నిర్వహించిన డాక్టర్ కోసూరు వెంకట సుబ్బారావును ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



హెచ్చరిక బోర్డులను పరిశీలిస్తున్న రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్

నరసరావుపేట రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు రూరల్ పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రమాదాల అధికంగా చోటుచేసుకునే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. గుంటూరు–అనంతపురం జాతీయ రహదారిపై పట్టణం నుంచి వెళ్లే వాహనాలు క్రాస్ అయ్యే వినుకొండ రోడ్డు వై జంక్షన్, ఎస్ఆర్‌కేటీ జంక్షన్, ఆర్‌కే రెస్టారెంట్ ప్రాంతాలతో పాటు తొమ్మిది చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ కిషోర్ తెలిపారు. వాహనదారులు హెచ్చరిక బోర్డులను పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన



రైతు పొలాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో ప్రకృతి వ్యవసాయ రైతు నాసిన ఏడుకొండలు, నాసిన పద్మావతి వ్యవసాయ క్షేత్రాన్ని ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకుడు టి. సైదయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట వేసే ప్రతి రైతు మిరప మొక్కలను బీజామృతంతో నారు శుద్ధి చేయడం ద్వారా మొక్కలకు వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు భూమి నుంచి వచ్చే తెగుళ్లు, వేరు కుళ్లు, పూజేరియం తెగులు మొక్కల ద్వారా వచ్చే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. మొక్కలు వేసేటప్పుడు ఎకరాకు 400 కేజీల ఘన జీవామృతం వేయడం ద్వారా భూమిలో సూక్ష్మ జీవులు అభివృద్ధి జరుగుతుందని, తద్వారా మొక్కలకు అన్ని రకాల పోషకాలు అందుబాటులోకి రావడంతో పాటు భూమి సారవంతమవుతుందన్నారు. బీజామృతంలో రైతు స్థాయిలో ఎటువంటి ఖర్చు లేకుండా తయారు చేసుకోవచ్చని, దీని కోసం 100 లీటర్ల నీరు, 5 లీటర్ల ఆవు మూత్రం, 5 కేజీల పేడ, 10 గ్రాముల సున్నం సరిపోతుందన్నారు. ప్రధానపంటతో పాటు అంతర పంటలుగా ఉల్లి బంతి, ముల్లంగి, కొత్తిమీర ప్రతి రెండు మిరప మొక్కల తర్వాత మార్చి మార్చి వేసుకోవడం ద్వారా చీడపీడల ఉధృతి తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో డివిజన్ ఎంటీ తిరుపతిరావు, భాస్కరరావు, కోటేశ్వరరావు, వేణుగోపాల్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై, సంసిద్ పాఠశాల ఉపాధ్యాయిలు

శావల్యాపురం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు సూచించారు. గురువారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పోలీసు స్టేషను ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేటి సమాజంలో కాలుష్యం పెరగటం వలన ఓజోన్ పొరకు రంధ్రాలు పడటంతో పర్యావరణం అంతా కాలుష్యంతో నిండిపోతుందన్నారు. మొక్కలను పెంపకం తగ్గిపోవటం ఈసమస్యలన్నీ వస్తున్నాయన్నారు. మొక్కలను నాటి వాటిని సంరక్షణ చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న రోజుల్లో మొక్కలు నాటకపోతే పర్యావరణం పూర్తిస్థాయిలో దెబ్బతినే అవకాశాలు ఉన్నాయన్నారు. భావితరాలు వారందరు ఆరోగ్యంగా ఉండాలంటే విద్యార్థి దశ నుంచి మొక్కలు నాటాలని అలాగే ప్రాముఖ్యత వివరించాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటాలి... పర్యావరణాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నాగరాజు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలు అరికట్టండి

కమిషనరును కోరిన వినియోగదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు

నరసరావుపేట: పట్టణానికి నాలుగువైపులా బహిరంగంగా రోడ్లపై విచ్చలవిడిగా చేస్తున్న జంతు వధలు, చేపలు, మాంసం విక్రయాలను వెంటనే నిలుపుదల చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు కుంచాల స్వామి కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనరు ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనాల వల్ల రోడ్లమార్జిన్లలో పెట్టి విక్రయిస్తున్న మాంసంపై దుమ్ము, ధూళి, ఈగెలతో కలుషితమౌతుందన్నారు. అనేక పరిశుభ్రతలేని ప్రాంతాల్లో చేపలు, రొయ్యలు రోడ్లపై పోసి విక్రయిస్తున్నారన్నారు. మరికొంతమంది వివిధరోగాలతో చనిపోయిన జంతువులకు చెందిన మాంసాన్ని సైతం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇటువంటివి తినటం వల్ల ప్రజలు దీర్ఘకాలిక రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అందువలన రోడ్లపై బహిరంగంగా నిర్వహిస్తున్న మాంసం విక్రయాలను నిలుపుదల చేసి అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశాలను గుర్తించి మాంసం విక్రయాల మార్కెట్లను ఏర్పాటు చేయాలని, జంతువుల వధకు ముందు వెటర్నరీ డాక్టర్లచే పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు.

ఆరోగ్యకర జీవనశైలితో మెరుగైన ఆరోగ్యం



సాతులూరులో మొక్క నాటుతున్న సీడీపీవో శాంతకుమారి, అంగన్‌వాడీలు

నాదెండ్ల: ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించుకోవటం వలన మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని సీడీపీవో శాంతకుమారి చెప్పారు. సాతులూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పెరటి తోటల్లోని ఆకుకూరలు, కూరగాయలను పండించి వినియోగించుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన చక్కటి జీవనశైలి అలవర్చుకోవాలన్నారు. యోగా, వ్యాయామం, నడకతో మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు సోకకుండా నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యడ్లపాడు...

యడ్లపాడు మండలం తిమ్మాపురం, దింతెనపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక మాసోత్సవాలు నిర్వహించారు. ఏసీడీపీవో నిర్మలారాణి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత ఆరోగ్యంపై ప్రభావితమౌతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటారు. తల్లులు, పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ ఫుడ్ ప్రదర్శించారు. కార్యక్రమంలో కె.వెంకటరమణ పాల్గొన్నారు.

ఇది టీడీపీ ప్రభుత్వం.. మా కాళ్ల దగ్గర ఉండాల!

నరసరావుపేట రూరల్: వినుకొండరోడ్డులోని శ్రీ యోగి వేమారెడ్డి రెడ్డి బాలుర హస్టల్ వద్ద గురువారం మద్యం మత్తులో ఉన్న యువకులు వీరంగం సృష్టించారు. కారులో హాస్టల్‌లోకి వచ్చిన యువకులు చక్కర్లు కొడుతూ హాల్‌చల్ చేశారు. కొంతసేపటికి కారు దిగిన నలుగురు యువకులు అసభ్య పదజాలంతో దూషించడం మొదలుపెట్టారు. దీనిని గమినించిన హాస్టల్ సిబ్బంది యువకులను అడ్డుకునే ప్రయత్నంచేయగా వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు. ఇది టీడీపీ ప్రభుత్వం.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాదు.. మీరు మా కాళ్ల దగ్గర ఉండాలంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. వసతి గృహానికి వెళ్లే దారిలో పగటి పూటే మద్యం, గంజాయి సేవిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని వసతి గృహం సిబ్బంది చెబుతున్నారు. అయితే వసతి గృహంలో మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించడంపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్టు హాస్టల్ సూపర్‌వైజర్ వెంకటరెడ్డి తెలిపారు.

మహాకవి గుర్రం జాషువా రచనలు చిరస్మరణీయం

నరసరావుపేట: సమాజాన్ని మేలుకొల్పుతూ మహాకవి, నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల గుర్రం జాషువా రచించిన సాహిత్యం అజరామరమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక టౌన్‌హాలులో జీవన జ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుర్రం జాషువా 129వ జయంతోత్సవాల సందర్భంగా మూడురోజుల జాతీయస్థాయి రంగస్థల పద్య నాటక పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, టీడీపీ నాయకులు కొట్టా కిరణ్‌కుమార్, క్రాంతికుమార్, కోలా సంజీవరావు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

మాది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 25, 26, 27, 28, 29, 30, 31 వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసారపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ గట్టుపల్లి సత్యనారాయణ, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.